క్లుప్తంగా

పాఠశాలలో హైమాస్ట్ లైట్ల ఏర్పాటు



హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయడానికి భూమిపూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు

కందుకూరు: కందుకూరు జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రభుత్వం హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయడానికి రూ.8లక్షల నిధులు మంజూరు చేసింది. దీంతో గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ గుండ్ర సుధాకర్‌రెడ్డి, మాజీ వార్డు సభ్యుడు సొడపు వెంకటేశ్‌గౌడ్, స్థానిక నాయకులు గాదె కుమార్ ఆదివారం హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయడానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు అనిల్, శ్రీశైలం, నర్సింహ, కృష్ణ, శ్రీను, జగదీశ్ పాల్గొన్నారు.

గుర్రంబాబిరెడ్డి కాలనీ కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న కాలనీవాసులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని గుర్రంగూడలోని గుర్రంబాబిరెడ్డి కాలనీ సంక్షేమ సంఘం సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా వై.విజయసాగర్, ఉపాధ్యక్షుడిగా ఎం.వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శిగా వి.జయపాల్ రెడ్డి, కార్యదర్శిగా వి.సందీప్‌రెడ్డి, కోశాధికారిగా పి.రాజు, ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా విజయసాగర్ మాట్లాడుతూ.. కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కాలనీవాసులను కలుపుకొని కృషిచేస్తానన్నారు. రోడ్లు, డ్రైనేజీలు, స్ట్రీట్ లైట్లు, రిపేర్లు మౌలిక వసతులకు తనవంతు కృషి చేస్తానని వెల్లడించారు. కాలనీ అభివృద్ధే తన బాధ్యతని తెలిపారు. నియామకానికి పూర్తి సహకారం అందించిన కాలనీవాసులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

50వేల ఇళ్లకు ఉచిత విద్యుత్

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

తుక్కుగూడ: మహేశ్వరం నియోజకవర్గంలో దాదాపుగా 50 వేల గృహాలకు ఉచిత విద్యుత్ వెలుగులు అందుతాయని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్ పేర్కొన్నారు. ఆదివారం తుక్కుగూడ పురపాలక సంఘం పరిధిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన మాట మేరకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందజేస్తోందన్నారు. తాము ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తున్నామన్నారు. ప్రభుత్వంపై ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు నమ్మరన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి



సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

బడంగ్‌పేట్: సీసీ కెమెరాలు కనిపించని మరో నిఘా నేత్రాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 1వ డివిజన్ నవయుగ కాలనీలో కాలనీవాసులు ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలను ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే విచ్చేసి ప్రారంభించారు. నేరాల నియంత్రణకు సీసీకెమెరాలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

నియామకం

ఆమనగల్లు: బీసీ సంక్షేమ సంఘం తలకొండపల్లి మండలం అధ్యక్షుడిగా పడకల్ గ్రామానికి చెందిన గుజ్జరి రాఘవేందర్‌ను నియమించారు. హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో తలకొండపల్లి కార్యవర్గాన్ని నియమించి పత్రాలు అందించారు. బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా రాఘవేందర్, ఉపాధ్యక్షుడిగా యాదయ్యగౌడ్, ప్రధాన కార్యదర్శిగా నర్సింహగౌడ్, అధికార ప్రతినిధిగా రవీందర్‌యాదవ్, ప్రచార కార్యదర్శులుగా నరేశ్‌ముదిరాజ్, స్వామిగౌడ్, సోషల్ మీడియా ఇన్‌చార్జిగా కుమార్‌యాదవ్‌లను నియమించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చెర్కు మణికంఠ, నాయకులు రాజు, నిర్మల, శ్రీశైలంగౌడ్, జంగయ్య పాల్గొన్నారు.

పన్నులు సరే.. సదుపాయాలేవీ?

- బిల్ కలెక్టర్లను నిలదీస్తున్న జల్‌పల్లి పురప్రజలు
- కాలనీలను అభివృద్ధి చేయాలని డిమాండ్

పహాడీషరీఫ్: ఆర్థిక సంవత్సరం(2024–25) ముగింపు గడువు దగ్గర పడుతున్న నేపథ్యంలో శతశాతం ఆస్తి పన్ను వసూలుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్న జల్‌పల్లి మున్సిపాలిటీ అధికారులకు ప్రజల నుంచి ప్రశ్నలు ఎదురవుతున్నాయి. పన్నులు వసూలు చేయడంపై ఉన్న శ్రద్ధ బస్తీలలో మౌలిక సదుపాయాలు కల్పించడంపై ఎందుకు లేదని సామాన్యులు నిలదీస్తున్నారు. రోడ్లు, మంచి నీటి, డ్రైనేజీ పైప్‌లైన్లు, వీధి దీపాలు లాంటి కనీస సదుపాయాలు కల్పించాలని అధికారులకు స్థానిక ప్రజలు మొరపెట్టుకున్న ఘటనలు ఈ మున్సిపాలిటీలో కోకొల్లలుగా ఉన్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధుల నుంచి 'నిధుల లేమి' అనే సాకుల మాటలు వినలేని ఎన్నో కాలనీలవాసులు చందాలు వేసుకొని డ్రైనేజీ పైప్‌లైన్లు నిర్మించుకున్న ఘటనలు ఉన్నాయి. ప్రస్తుతం ట్యాక్స్‌లు ఎట్టి పరిస్థితుల్లో కట్టాల్సిందేనంటూ ఇంటింటికి తిరుగుతున్న బిల్ కలెక్టర్లకు.. తాము కట్టలేమని ప్రజలు తెగేసి చెబుతుండడం గమనార్హం.

కొన్ని ప్రాంతాలను విస్మరించారు!

ఇతర మున్సిపాలిటీలతో పోల్చితే జల్‌పల్లి భిన్నమైన వాతావరణం కలిగి ఉంటుంది. జల్‌పల్లి గ్రామంతో పాటు శ్రీరాం కాలనీ నుంచే మున్సిపాలిటీకి అధికంగా ఆస్తి పన్ను రూపంలో ఆదాయం సమకూరుతోంది. కానీ అభివృద్ధిలో మాత్రం ఈ రెండు ప్రాంతాలపైనే వివక్ష కొనసాగుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. గత పాలక మండలిలో చైర్మన్, వైస్ చైర్మన్ పదవులలో కొనసాగిన వారు ఈ ప్రాంతాలను విస్మరించి షాహీన్‌నగర్, ఎర్రకుంట, కొత్తపేట, పహాడీషరీఫ్ ప్రాంతాలకే ఎక్కువ నిధులు కేటాయించుకున్నారనే బహిరంగ విమర్శలు వినవస్తున్నాయి. పన్నులు చెల్లించేది ఇక్కడ నుంచి అయితే.. అభివృద్ధి అక్కడ చేస్తే.. తామెందుకు చెల్లించాలంటూ బీజేపీ నాయకులు ఆందోళనలకు సిద్ధమవుతున్నారు. ఈ విషయమై శ్రీరాం కాలనీకి చెందిన బీజేపీ నాయకులు పార్టీ మహేశ్వరం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్‌ను ఆదివారం కలిసి సమస్యను విన్నవించారు.

ఉన్నోడికి తక్కువ.. లేనోడికి ఎక్కువ

మున్సిపాలిటీ పరిధిలో ప్రస్తుతం విధిస్తున్న ట్యాక్స్‌లపై కూడా సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అందరి అండదండలు కలిగి భవనాలు ఉన్నవారికి తక్కువ ట్యాక్స్‌లు.. చిన్నపాటి ఇళ్లు కలిగిన పేదలకు ఎక్కువ ట్యాక్స్‌లు విధిస్తున్నారన్న అంశం చర్చనీయాంశంగా మారింది. 2020 లాక్‌డౌన్‌కు ముందు నిర్వహించిన భువన్ సర్వే ఆధారంగానే పన్నులు విధిస్తున్నామని అధికారులు చెబుతున్నప్పటికీ... అదే భవనాలలో ఇటీవల అదనంగా కొనసాగిన నిర్మాణాలను లెక్కించడం లేదనే ఆరోపణలున్నాయి. ఇలాంటి కారణంగా పక్కింటికి అంతేవచ్చింది.. మా ఇంటికి ఇంతొచ్చిందనే విషయంలో కూడా బిల్ కలెక్టర్లకు స్థానిక ప్రజల నుంచి చీవాట్లు పడుతున్న సందర్భాలు నెలకొన్నాయి. గతేడాది అక్టోబర్ నుంచి పెంచిన ట్యాక్స్‌లతో అధికంగా బిల్లులు రావడం కూడా ప్రజలను ఆందోళనలకు గురిచేయడానికి మరో కారణంగా కనిపిస్తుంది.

నాటి సిబ్బందే కొనసాగింపు

జల్‌పల్లి, పహాడీషరీఫ్, కొత్తపేట, బాలాపూర్(పార్ట్) గ్రామ పంచాయతీలతో కలిసి 2016 ఏప్రిల్ 11న ఏర్పాటైన జల్‌పల్లి మున్సిపాలిటీలో అప్పటి సిబ్బందినే ఇప్పటికీ కొనసాగిస్తుండడంతో అధికారులకు నిర్వహణ భారం పట్టుకుంది. అప్పట్లో 15–16 వేల అసెస్‌మెంట్లు మాత్రమే ఉండగా ప్రస్తుతం కొత్తగా ఏర్పాటవుతున్న కాలనీలతో 36–37 వేల వరకు పెరిగింది. పెరిగిన జనాభా, కాలనీలకు అనుగుణంగా ఇక్కడ 300 మంది వరకు పారిశుద్ధ్య కార్మికులు ఉండాల్సి ఉండగా, ఒకప్పటి గ్రామ పంచాయతీ సిబ్బంది 80 మందే కొనసాగుతున్నారు. ఇలాంటి సమస్యపై దశాబ్దంగా ప్రజాప్రతినిధులు కొత్త వారిని విధుల్లోకి తీసుకోవాలన్న ధ్యాసే మరిచారు. కనీసం గత పాలక మండలి సమయంలో ఇలాంటి ప్రధాన సమస్యపై తీర్మానం కూడా చేయలేని పరిస్థితి నెలకొంది.



జల్‌పల్లి మున్సిపల్ కార్యాలయం



బృందావన్ కాలనీలో పారుతున్న మురుగు

సదుపాయాలు కరువు



శ్రీరాం కాలనీలో కనీస సదుపాయాలు కరువయ్యాయి. సమస్యలను పరిష్కరించాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. ట్యాక్స్‌లు మాత్రం ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. కట్టకుంటే ఇల్లు జప్తు చేస్తామని నోటీసులు జారీ చేస్తున్నారు. 17వ వార్డులోని బృందావన్, రిలయన్స్ కాలనీలలో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ కూడా లేదు.

– షేర్ సింగ్ యోగి, శ్రీరాం కాలనీ

ఫ్యూచర్ సిటీలో విలీనం చేయాలని వినతి



ఎమ్మెల్యే సబితారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ నాయకులు

మహేశ్వరం: మహేశ్వరం, కందుకూరు మండలాలను పూర్తిగా ఫ్యూచర్ సిటీలో విలీనం చేయాలని అసెంబ్లీలో లేవనెత్తానని ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. ఆదివారం మహేశ్వరం మండల ఫ్యూచర్ సిటీ జేఏసీ ఆధ్వర్యంలో నాయకులు మీర్‌పేట్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆమెను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజల ఆంక్షల మేరకు తాను పనిచేస్తానని తెలిపారు. మహేశ్వరం, కందుకూరు మండలాలను పూర్తిస్థాయిలో ఫ్యూచర్ సిటీలో విలీనం చేయాలని తాను ఇటీవల అసెంబ్లీ సమావేశంలో మాట్లాడనని తెలిపారు. మండలంలోని కొన్ని గ్రామాలను విలీనం చేసి కొన్నింటిని చేయకపోవడం సరైందికాదని తప్పుబట్టానని పేర్కొన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలోని మహేశ్వరం, కందుకూరు మండలాలను ఫ్యూచర్ సిటీలో విలీనం చేసేవరకు జేఏసీ సభ్యులతో కలిసి పోరాడుతానని తెలిపారు. మీ అభిప్రాయమే నా అభిప్రాయమని మీరు చేస్తున్న ఉద్యమానికి తన సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. అంతకుముందు ఎమ్మెల్యేకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మహేశ్వరం ఫ్యూచర్ సిటీ జేఏసీ చైర్మన్ వత్తుల రఘుపతి, గౌరవ అధ్యక్షుడు కర్నాటి మనోహర్, ప్రధాన కార్యదర్శి వర్కల యాదగిరిగౌడ్, గౌరవ సలహాదారులు మల్లేశ్ యాదవ్, సుదర్శన్‌రెడ్డి, హన్మగళ్ల చంద్రయ్య, కర్రోళ్ల చంద్రయ్య, కరుణాకర్‌రెడ్డి, రాఘవేందర్ రెడ్డి, యాదిశ్, మాధవచారి, నవీన్, సుధీర్ గౌడ్, సుదర్శన్ యాదవ్, రాయప్ప, దేవ్యానాయక్, దత్తునాయక్, రమేశ్, నర్సింహయాదవ్ పలువురు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు మేలు

రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు: ముఖ్యమంత్రి సహాయనిధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి కోరారు. పేద, మధ్య తరగతి కుటుంబాల ఆరోగ్య రక్షణకు సీఎంఆర్‌ఎఫ్ తోడ్పాటునందిస్తుందని ఆయన అన్నారు. ఆమనగల్లు పట్టణంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో మున్సిపాలిటీ పరిధిలోని పెంటతండాకు చెందిన జటావత్ రవికి సీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరైన రూ.18 వేల చెక్కును పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, శంకర్, మాజీ మార్కెట్ డైరెక్టర్ సుభాష్, మాజీ కౌన్సిలర్ రాములునాయక్, నేతలు సుమన్‌నాయక్, శేఖర్, సతీష్, శివకుమార్, శ్రీను తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆమనగల్లు మండలం మేడిగడ్డతండాకు చెందిన గణేశ్‌కు ఎమ్మెల్యే కసిరెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి పథకం కింద రూ.50 వేలు మంజూరు కాగా, లబ్ధిదారునికి కాంగ్రెస్ నాయకుడు విజయ్‌రాథోడ్ చెక్కును అందించారు.

భూ సేకరణ రద్దు చేయాలి

యాచారం: మండలంలోని మొండిగౌరెల్లి గ్రామంలోని 822 ఎకరాల అసైన్డ్, పట్టా భూముల సేకరణకు వేసిన నోటిఫికేషన్‌ను వెంటనే రద్దు చేయాలని ఆ గ్రామస్తులు డిమాండ్ చేశారు. గ్రామంలోని బాధిత రైతులు శనివారం రాత్రి బొడ్రాయి వద్ద సమావేశమయ్యారు. భూసేకరణకు వేసిన నోటిఫికేషన్‌ను వెంటనే రద్దు చేయాలన్నారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. శాంతియుతంగా నిర్వహించే ఈ పోరాటంలో గ్రామస్తులమంతా ఐక్యంగా ఉంటామన్నారు. ప్రాణాలైన ఇస్తాం కాని భూములిచ్చేది లేదని తీర్మానం చేసుకున్నారు.

వైభవంగా రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

యాచారం: మండల కేంద్రంలో శ్రీ వేంకటేశ్వరస్వామి రథోత్సవం ఆదివారం ఉదయం వైభవంగా నిర్వహించారు. పూజారులు హరిబాబు, రాజేష్‌ల ఆధ్వర్యంలో దేవాలయం ఎదుట రథోత్సవానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు రథాన్ని పోటీపడి లాగారు. మండల కేంద్రంలోని వీధుల గుండా రథోత్సవం కనులపండువగా సాగింది. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

అకాల వర్షం.. మిగిల్చిన నష్టం



అన్నబోయిన్‌పల్లిలో దెబ్బతిన్న మొక్కజొన్న పంట



బ్రాహ్మణపల్లిలో పొలంలో రైతు ఆవేదన

- వడగళ్ల వానతో దెబ్బతిన్న మొక్కజొన్న పంట
- ఆదుకోవాలని రైతుల వేడుకోలు

మాడ్గుల: అకాల వర్షం అన్నదాతలను అతలాకుతలం చేస్తోంది. వరుణుడి ప్రతాపం కారణంగా ఆరుగాలం శ్రమించిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మండల పరిధిలోని అన్నబోయిన్‌పల్లి, బ్రాహ్మణపల్లి, అర్కపల్లి, ఇర్విన్ గ్రామాలతో పాటు సమీప తండాల్లో వేసిన మొక్కజొన్న పంట శనివారం రాత్రి కురిసిన వడగళ్ల వానకు పూర్తిగా దెబ్బతింది. దాదాపు 357 ఎకరాలలో పంటకు నష్టం వాటిల్లినట్లు మండల వ్యవసాయ అధికారి అరుణకుమారి ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. ఈ మేరకు ఆమె సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టపోయిన పంట వివరాలను సేకరించనున్నారు. చేతికి వచ్చిన పంట ఈదురు గాలులతో కురిసిన వర్షానికి దెబ్బతినడంతో రైతులు లబోదిబోమంటున్నారు. తమని ప్రభుత్వమే ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

మండలంలో భారీ వర్షం కురిసింది. అక్కడక్కడ వడగళ్లు సైతం పడ్డాయి. దీంతో పలుచోట్ల మామిడి కాయలు రాలిపోయాయి. గంటసేపు ఏకధాటిగా వర్షం కురవడంతో మండలంలో రైతులు తీవ్రంగా నష్ట పోయారు. మార్కెట్‌లో నిల్వ ఉంచిన ధాన్యం తడిసిపోయింది. మండలంలో ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో పలుచోట్ల గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. గ్రామస్తులు అంధకారంలో మగ్గి దోమలతో తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌దే గెలుపు


ఎమ్మెల్యే సబితారెడ్డి



ఎమ్మెల్యే సబితారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న నాయకులు

మహేశ్వరం: త్వరలో జరిగే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ విజయం సాధించడం ఖాయమని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని సిరిగిరిపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీజేపీలకు చెందిన పలువురు కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందన్నారు. ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు నచ్చక ఆ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందగా బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నారన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. త్వరలో జరిగే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. భవిష్యత్తు అంతా బీఆర్‌ఎస్‌దేనన్నారు. కాంగ్రెస్, బీజేపీ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిన వారిలో పాలమూరి నర్సింహ, చిట్టె రాజు, జే.రాజు, విజయ్ పలువురు ఉన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షుడు దయ్యాల శ్రీనివాస్, బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు హన్మగళ్ల చంద్రయ్య, సురేందర్‌రెడ్డి, లక్ష్మీనర్సింహరెడ్డి, చంద్రశేఖర్, బండ నర్సింహ, బియ్యం బాబు, తడకల యాదయ్య, కృష్ణ పలువురు పాల్గొన్నారు.

మురుగు పారి.. దుర్గంధం దరిచేరి



ఈ-సిటీ వద్ద సర్వీస్ రోడ్డులో ఉన్న వ్యర్థాలు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని ఈ–సిటీ నెహ్రూ ఔటర్ రింగు రోడ్డు సర్వీస్ రోడ్డులో దుర్వాసనతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సర్వీస్ రోడ్డులో వర్షపు నీరు పోవడానికి ఏర్పాటు చేసిన వరద కాల్వలో గుర్తు తెలియని వ్యక్తులు కంపెనీల వ్యర్థ రసాయనాలు ఇక్కడ వదులుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. రాత్రి సమయంలో గుట్టు చప్పుడు కాకుండా గత కొద్దిరోజుల నుంచి వ్యర్థాలను ఇక్కడ వేయడంతో తీవ్రమైన దుర్వాసన వస్తోందని ఆరోపిస్తున్నారు. ఇక్కడి నుంచి ప్రయాణం చేయడానికి వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సర్వీస్ రోడ్డు వెంబడి ఈ–సిటీలో పనిచేసే వందలాది మంది కార్మికులు ప్రయాణం చేస్తుంటారు. వ్యర్థాలు వేయకుండా తగు చర్యలు తీసుకొని, దుర్వాసన రాకుండా చూడాలని ఔఆర్ఆర్ నిర్వాహకులు, స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మహనీయుల త్యాగం మరువలేనిది



పహాడీషరీఫ్: భగత్‌సింగ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న యువకులు



మీర్‌పేట: బాలాపూర్ చౌరస్తాలో..

పహాడీషరీఫ్: భారత స్వాతంత్య్ర పోరాటంలో ప్రాణత్యాగాలు చేసిన భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజుగురులను ఈ దేశం ఎన్నటికీ మరువబోదని జల్‌పల్లి మున్సిపాలిటీ శ్రీరాం కాలనీ యువకులు పేర్కొన్నారు. షహీద్ దినోత్సవం సందర్భంగా కాలనీలో ఆదివారం ముగ్గురు అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముగ్గురు మహనీయుల పేర్లు వింటేనే భారతీయుల రక్తం దేశభక్తితో ఉప్పొంగుతుందన్నారు. అలాంటి దేశ భక్తులను 1931 మార్చి 23న నాటి బ్రిటిష్ ప్రభుత్వం ఉరి తీసిందన్నారు. దేశం కోసం వారు చూపిన చొరవ నేటి యువతకు ఆదర్శమన్నారు. కార్యక్రమంలో శాంతకుమార్, నాగార్జున, హరికృష్ణ, వాసుబాబు, కృష్ణ, రాము, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ అడుగుజాడల్లో నడవాలి

మీర్‌పేట: సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో మీర్‌పేట బాలాపూర్ చౌరస్తాలో ఆదివారం భగత్‌సింగ్ 94వ వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీశ్ ముఖ్య అతిథిగా హాజరై భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. దేశ స్వాతంత్య్రం కోసం భగత్‌సింగ్ వంటి ఎందరో వీరులు ప్రాణత్యాగం చేశారని గుర్తుచేశారు. నేటి యువత భగత్‌సింగ్ అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్ యాదవ్, కృష్ణమూర్తి, ప్రకాశ్‌రెడ్డి, బాబు, చారి, నిరంజన్, అంజనేయులు, దాసరి అరవింద్ పాల్గొన్నారు.

సమరయోధుల ఆశయ సాధనకు కృషి



భగత్‌సింగ్ జీవిత చరిత్ర పుస్తకాలను పంపిణీ చేస్తున్న నాయకులు

నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి దత్తునాయక్

మహేశ్వరం: విప్లవవీరుడు, స్వాతంత్య్ర సమరయోధుడు భగత్‌సింగ్, సుఖ్‌దేవ్‌ల ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మహేశ్వరం నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి దత్తు నాయక్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్, జగ్జీవన్ రామ్ చౌరస్తాలో మాతృవీరుల దినోత్సవం సందర్భంగా భగత్‌సింగ్, సుఖ్‌దేవ్‌ల చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి యువత భగత్‌సింగ్, సుఖ్‌దేవ్‌ల జీవిత చరిత్రలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అంతకుముందు ఆయన భగత్ సింగ్ చరిత్ర పుస్తకాలను గ్రామస్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహేశ్వరం ఫ్యూచర్ సిటీ జేఏసీ చైర్మన్ వత్తుల రఘుపతి, జేఏసీ నాయకులు నందిగామ నర్సింహ, చంద్రయ్య, మనోహర్, రాయప్ప, సుదర్శన్ యాదవ్, రాయప్ప, నర్సింహ యాదవ్, లాజర్,సుబాష్ పలువురు పాల్గొన్నారు.

మాసబ్ చెరువు పరిరక్షణకు కృషి

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



ఎమ్మెల్యే రంగారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న చెరువు పరిరక్షణ సమితి సభ్యులు

తుర్కయంజాల్: మాసబ్ చెరువు పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. ఇప్పటికే చెరువు శిఖం భూమి 137 సర్వే నంబర్‌లో అక్రమంగా డంప్ చేసిన మట్టిని తొలగిస్తున్నామని తెలిపారు. వినాయకుడి నిమజ్జనాల సమయంలోని వ్యర్థాలను వెంటనే తొలగించాలని కమిషనర్ అమరేందర్ రెడ్డిని ఆదేశించారు. ఆదివారం చెరువు పరిరక్షణ సమితి సభ్యులు ఎమ్మెల్యేను కలిసి ఎఫ్‌టీఎల్ పరిధి, తుర్కయంజాల్ రెవెన్యూ సర్వే నంబర్ 205లో అక్రమంగా డంప్ చేసిన మట్టిని తొలగించాలని వినతిపత్రం అందజేశారు. శిఖం భూమిలో డంప్ చేసిన మట్టిని తొలగించాలని ఎమ్మెల్యే అసెంబ్లీలో ప్రశ్నించిన వెంటనే ప్రభుత్వం దిగివచ్చి చర్యలు ప్రారంభించడం హర్షించదగ్గ విషయమని కొనియాడారు. కార్యక్రమంలో చెరువు పరిరక్షణ సమితి సభ్యులు రమేష్, సునీల్, ఆశీర్వాదం, శ్యామల పాల్గొన్నారు.